# నిప్పులాంటివాడు

నేను నాలుగేళ్లక్రితం దిబ్బ నగరం వెళ్లినప్పుడు నగరం పాపంలాగా పెరిగిపోతున్నది. అయితే "పాపం" అనేమాట దానికి వర్తించినట్టు కనపడలేదు. ఎక్కడ పడితే అక్కడ కొత్త కాలనీలు! ఒకే అచ్చులో తయారైనట్టున్న అయిదంతస్తుల మేడలు, విశాలం చేసి, తారు వేసి, అద్దంలా తయారవుతున్న రోడ్లు. ఆ రోజుల్లో దిబ్బనగరంలో కొన్ని భాగాలు న్యూయార్కు నుంచి అప్పు తెచ్చుకున్నట్టుగా ఉండేవి.

ఈసారి నా కళ్లను నేనే నమ్మలేకపోయాను. వ్యాసుడు శపించిన కాశీయా? లేక అంగారక గ్రహవాసులెవరైనా కొత్తరకం బాంబులు వేసి పోయారా? లేక మొత్తం నగరమంతా మీసా కింద పోలీసుల క్రమశిక్షణకు గురి అయిందా అన్నట్టున్నది దిబ్బ నగరం. అన్ని రోడ్లూ గుంటలుపడి, గండ్లుకొట్టి, బురద గుంటలు కలిగి ఉన్నాయి. ఏ రోడ్డు మీద యేవున్నవో సైకిలు గాని, స్కూటరుగాని, కారు గాని, బస్సు గాని కనిపించలేదు.

మార్పు సహజమే గాని ఇంత మార్పు చాలా అసహజం. అదృష్టవశాన దిబ్బగాంధీగారి ప్రశిష్యులలో ఒకతను కనిపించాడు. "దిబ్బ ఇలా ఆర్కియాలాజికల్ సర్వేయర్‌కి గురైనట్టుందేమిటి, బాబుగారూ నాలుగేళ్ల క్రితం ఈ నగరం నవవధులాగుండేది గదా" అన్నాను.

బాబుగారు నవ్వి, "అప్పుడున్న ముఖ్యమంత్రి పరమపాపిష్ఠి కదా, నాయనా! లంచాలు తిన్నది చాలక, పౌరసదుపాయాల ఖర్చులో వాటా కోసం నగరాన్ని మనం ఊహించలేనన్ని విధాల మరమ్మత్తులు చేశాడు. అతగాడు దిగిపోయాక ఇప్పుడొచ్చిన అతను నిప్పులాంటివాడు. డబ్బును విషంతో సమానంగా చూస్తాడు. నోట్లమీద 'పాయిజన్' అని అచ్చు వేయించటం లేదు, అంతే. ప్రతి దిక్కు మాలిన సందూ మరమ్మతులు చెయ్యటానికీ, ప్రతి కూడలిలో పార్కులు వెయ్యటానికీ, ప్రజా సౌకర్యాలకని పేరు పెట్టి లక్షలూ కోట్లు దుర్వయం చెయ్యటానికి అతని ఖర్మ ఏం కాలింది, నాయనా?" అన్నాడు.

''ఔరా! ఎంతటి యోగ్యులుంటారు, ఈ కలియుగంలో కూడా'' అని ఆశ్చర్యపోయాను.

*ముద్రణ : ప్రభవ, మార్చ్ 1977*